క్లుప్తంగా

అభివృద్ధి పనులపై సమీక్ష



దాచేపల్లి: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ కందుల జాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం గురువారం జరిగింది. గ్రామాల వారీగా చేపడుతున్న పనులపై చర్చించారు. ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులు సకాలంలో చేపట్టాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ జాను చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ, సూపరింటెండెంట్ రత్నం, ఈవోపీఆర్డీ గుప్తా, ఏపీడీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాచవరం: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారీపై వారితోపాటు గ్రామ సమాఖ్య సంఘాల అధ్యక్షులకు కూడా గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు స్థానికుల అవసరాలు గుర్తించి ప్రణాళికలు తయారు చేయించాలని సూచించారు. జడ్పీటీసీ శివా యాదవ్, మండల కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జానీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, వెలుగు సీసీ సీతారామయ్య, ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగుల గుర్తింపునకు సర్వే



పిడుగురాళ్ల రూరల్: మండలంలోని కామేపల్లి గ్రామంలో ఇంటింటి క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన అందరికీ రక్తం, బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆడవారికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తామని తెలిపారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు



మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు చేసి పలువురికి జరిమానా విధించినట్లు విద్యుత్తు శాఖ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరావు, ఏఈఈ సీహెచ్ రాంబట్ల తెలిపారు. విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని మాచవరం, పిన్నెల్లి, మోర్జంపాడు, కొత్తపాలెం, కొత్త గణేశునిపాడు, పిల్లుట్ల, గోవిందాపురం, తురకపాలెం గ్రామాల్లో గురువారం తనిఖీలు చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారికి మొత్తం రూ. 6.01 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. పల్నాడు జిల్లా పర్యవేక్షణ ఇంజినీర్ పి.విజయ్‌కుమార్, డీఈఈలు కె.రవికుమార్, టి.వీరేశ్వరరావు, ఇన్‌చార్జి ఏఈ భగవాన్‌నాయక్, ఏఈలు కె.కోటేశ్వరావు, చంద్రశేఖర్, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి



పిడుగురాళ్ల: నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీల భారం వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కన్వీనర్ తెలగపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార యాత్రలో భాగంగా ధర్నా నిర్వహించామన్నారు. అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు ఖాతాలో నగదు జమ కావటం లేదన్నారు. ఇసుక అందుబాటులో లేక కార్మికులు, ఇళ్ల నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాయకులు సంపత్ వెంకట కృష్ణ, షేక్ బాబు, హుస్సేన్, భాస్కర్‌రావు, ముక్కంటి, హస్సాన్, సైదా, అప్పారావులు పాల్గొన్నారు.

'పోవాల'న్నా యాతనే!

- శ్మశాన వాటికకు దారి లేక గ్రామస్తుల అవస్థలు
- అయినవారి అంతిమ యాత్రకూ తప్పని కష్టాలు
- ఇకనైనా అధికారులు స్పందించాలని వేడుకోలు

పిడుగురాళ్ల రూరల్: బతికున్నంత కాలం హుందాగా గడుపుతున్నాం... చనిపోయిన తర్వాత ఖననానికి కూడా కష్టాలు తప్పడం లేదు... శ్మశాన వాటిక ఉన్నా వెళ్లే మార్గం లేక నరకయాతన పడాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. కాలువలు దాటుతూ... పంట పొలాల్లో నడుస్తూ అయిన వారి మృతదేహంతో అవస్థలు పడుతూ వెళ్లక తప్పడం లేదు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కరపాలపాడు గ్రామంలో దుస్థితి ఇది. ఇది అటవీ ప్రాంతమో, మారుమూల గ్రామమో కాదు.. అద్దంకి – నార్కెట్ పల్లి హైవేకి కేవలం నాగులు కిలో మీటర్ల దూరంలోనే ఉన్న గ్రామం. పైగా మేజర్ పంచాయతీ కూడా. రాజకీయంగా మంచి పేరు ఉన్న కరాలపాడు గ్రామం. మృతదేహాన్ని ఖననం చేయాలంటే మాత్రం దారి లేని పరిస్థితి. గ్రామానికి చెందిన తంగిరాల అమ్మతారెడ్డి మృతి చెందింది. మృతదేహాన్ని తీసుకొని వెళ్లేందుకు బంధువులు నానా కష్టాలు పడ్డారు.



గొల్లమెట్ట వాగులో నుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం



పంట పొలంలో నుంచి తీసుకెళ్తున్న బంధువులు

ఖననం చేసేందుకు గ్రామం నుంచి బొందల గడ్డ వరకు రెండు కిలో మీటర్ల దూరం ఉంది. అందులో సుమారు 800 మీటర్ల వరకు గొట్టమెట్ట వాగు దాటి, పంట పొలాలు దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మోసే నలుగురికి నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి. గ్రామంలో ఎవరైనా చనిపోతే తీసుకొని వెళ్లే వారికి నరకం కళ్లముందే కనిపిస్తుంది. ఈ విషయం అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా వచ్చి చూసి పోవడం మినహా పరిష్కారం మాత్రం చూపలేదు. గతంలో బొందల గడ్డకు వెళ్లేందుకు 15 అడుగుల దారి ఉండేది. పక్క పొలాల వారు ఆక్రమించుకొని పూర్తిగా దారి లేకుండా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే అలేఖ స్వామి

- నేడు కార్తిక పౌర్ణమి నేపథ్యంలో మహాయజ్ఞం నిర్వహణకు ఏర్పాట్లు
- మూడు రోజులపాటు ఉత్సవాలు

గురజాల: కోరిన కోర్కెలు వెంటనే తీర్చే దైవంగా అలేఖ స్వామిని స్థానికులు కొలుస్తారు. ఏటా కార్తిక మాసంలో పౌర్ణమి నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పౌర్ణమి రోజు అఖండ బ్రహ్మ యజ్ఞం చేపడతారు. 12 గంటలపాటు నాగ సాధువులు దీనిని నిర్వహిస్తారు. యజ్ఞం, పూజలోని పండ్లను ప్రసాదంగా స్వీకరించి ఏమైనా కోరుకుంటే తప్పనిసరిగా ఫలితం ఉంటుందని భక్తుల నమ్మకం. 2వ రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మూడో రోజు అన్నప్రసాదం వితరణ చేస్తారు.

ఈ దేవాలయం 1960లో నిర్మించినట్లు శిలా శాసనాలు ఉన్నాయి. ఈ ఊరిలో ఎవరికైనా ఆడ పిల్ల పుడితే మహిమ అని, అబ్బాయి పుడితే అలేఖ అని నామకరణం చేస్తారు. అందుకే స్థానికంగా ఈ పేర్లు ఉన్న వారు ఎక్కువమంది కనిపిస్తారు.

ధర్మ బోధన

మహిమలు కలిగిన అలేఖ స్వామి ప్రతి ఒక్కరూ ధర్మం వైపు నడవాలని సూచించినట్లు, కొంతమంది శిష్యులను తయారు చేసి వారికి ధర్మబోధ చేసినట్లు చరిత్ర చెబుతోంది. పాప పరిహారం పూర్తిగా పారదోలడానికి స్వయంగా పరబ్రహ్మ స్వరూపుడే స్వయంభువుడై సాధువు రూపంలో హిమాలయాల్లో తపస్సు చేశారని ప్రతీతి. ఖండ గిరి, భువనగిరి, గవన గిరి పర్వతాల్లో 36 సంవత్సరాలు తపస్సు అనంతరం పూరి పురవీధుల్లో ప్రత్యక్షమై గోవింద బాబాగా మారారని చెబుతారు. ఆయనకు 92 మంది శిష్యులు ఉండేవారని, వారిని శవిషిష్టి సిద్ధులు, అనంత కోటి సిద్ధులు అని పిలిచేవారని



చర్లగుడిపాడులోని ఆలయం



మహా యజ్ఞం చేస్తున్న నాగ సాధువులు (ఫైల్)

చరిత్ర చెబుతోంది. వారిని దక్షిణ భారతదేశం వెళ్లి ధర్మాన్ని ఆచరించేలా చూడాలని ఆదేశించారని ప్రచారం. వారు పల్నాడు ప్రాంతంలోని చర్లగుడిపాడు గ్రామానికి వచ్చినట్లు చరిత్ర ఉంది. అప్పటి బ్రిటిష్ కాలంలో విక్టోరియా మహారాణి కూడా స్వామి వారి మహిమలు కనులారా చూసి వారు ధర్మ ప్రచారం చేసుకోవడానికి గ్రామంలో 0.16 సెంట్లు స్థలం విరాళంగా ఇచ్చినట్లు పెద్దలు చెబుతారు. ఈ ఆలయంలో జ్యోతి రూపంలో స్వామి వారు ఉంటారు. ఆలయ ఆవరణలో సిద్ధులు గజేంద్ర దాసు, తాండవ దాసుల స్మారకార్థం సంబంధిత నిర్మాణాలు కూడా ఉన్నాయి.

సేవ చేయడం అదృష్టం



స్వామి వారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. నా కుటుంబం పదేళ్లుగా స్వామి వారి సేవలో ఉంది. ఆయన మహిమలు కోకొల్లలు. కోర్కెలు వెంటనే తీర్చే దైవంగా స్వామిని భక్తులు నమ్ముతారు.

– శిరసాల శివ గోవిందరావు, చర్లగుడిపాడు.

అన్నదానం ఎంతో ఉత్తమం

సత్రశాల(రెంటచింతల): భక్తులకు అన్నదానం ఎంతో ఉత్తమమని,నిలా చేస్తే భగవంతునికి సమర్పించినట్లేనని దేవస్థానం ఈఓ గాదె రామిరెడ్డి అన్నారు. కార్తిక మాసం సందర్భంగా గురువారం మండలంలోని సత్రశాల వద్ద శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు చిట్టేల మల్లికార్జున శర్మ నేతృత్వంలో పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆర్. హనుమంతు



అలంకరణలో అమ్మవారు

నాయక్, లక్ష్మి, ఎ. వెంకటేశ్వర్లు, లక్ష్మి, కె. శివారెడ్డి, శ్రీలక్ష్మి, డి.రామిరెడ్డి, శివ నాగలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఈవో తెలిపారు. అన్నదాన కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య, మున్నా లింగయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



రెంటచింతల: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మాచర్ల డివిజన్ కార్యదర్శి బండ్ల మహేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పార్టీ నేతలు నిరసన తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ పి. బ్రహ్మయ్యకు అందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద షిరిడీ సాయి బాబా ఆలయంలో గురువారం పూజలు జరిగాయి. అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బకాయిల చెల్లింపునకు వినతి

నకరికల్లు: బకాయిలు వెంటనే చెల్లించి, తమను ప్రభుత్వరంగ ఉద్యోగులుగా గుర్తించాలని 108 అంబులెన్స్ ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.పుల్లారావును కలిసి 14 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ప్రస్తుత 108 అంబులెన్స్‌ల నిర్వహణ సంస్థను తొలగిస్తున్నామని ప్రకటన చేయడంతో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్, జీతాల బకాయిలు, వేతనంతో కూడిన సెలవులకు సంబంధించిన చెల్లింపులు విషయంలో ఆందోళనకర పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆందోళన పోగొట్టే విధంగా ప్రభుత్వం, నిర్వహణ సంస్థ నుంచి స్పష్టమైన హామీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 25న నుంచి సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ టి.బాబూరావు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఈఎంటీ బాబూరావు

ట్రాక్టర్‌ను ఢీకొని మేనేజర్‌కు గాయాలు

క్రోసూరు: స్థానిక యూనియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు జె.రాజ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకని ద్విచక్రవాహనం పై సత్తెనపల్లి వెళ్తూ.. ఎర్రబాలెం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక ఢీకొట్టాడు. .తీవ్రగాయాలైన క్షతగాత్రుడ్ని సత్తెనపల్లిలోని ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటం


రెంటచింతల: పేదల సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం చేస్తున్నట్లు పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కె. రంగనాయకులు అధ్యక్షతన ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం స్థలం ఇవ్వాలని 18న గ్రామ సచివాలయాలలో అర్జీలు ఇచ్చే కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తూతూ మంత్రంగా ఉచిత సిలిండర్లు ఇచ్చిందన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారు ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయానికి వ్యక్తిగత అర్జీలు ఇవ్వడానికి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుసేన్, మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మారుతి వరప్రసాద్

షుగర్ నియంత్రణకు ఆహార నియమాలు ముఖ్యం

సత్తెనపల్లి: షుగర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. వైద్యశాలలో ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా గురువారం షుగర్ వ్యాధిగ్రస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రపంచంలో రోజు రోజుకు మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారన్నారు. ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేయడం ద్వారా మధుమేహ వ్యాధిని దరికి చేరకుండా చూడవచ్చు నన్నారు. డాక్టర్ గిరిరాజు మాట్లాడుతూ షుగర్ వ్యాధితో పాటు వచ్చే వివిధ రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, డాక్టర్ సుజాత, డాక్టర్ కరుణాకర్, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం



వేడుకలో గ్రంథాలయ అధికారి రాజశేఖర్

విజయపురి సౌత్: మాచర్ల మండలం ఎత్తిపోతలలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగార్జున సాగర్ ఫ్లైటెక్ ఏవియేషన్ ఎండీ కెప్టెన్ మమత పాల్గొన్నారు. హెచ్‌ఎం దుర్గా భవాని ఆధ్వర్యంలో ముందుగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కెప్టెన్ మమత మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఏటా పాఠశాలలో 10 వ తరగతిలో టాపర్‌గా నిలిచిన వారి ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ కె.అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులకు వేషధారణ పోటీలు పెట్టారు. ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణ సమీపంలోని ఆక్స్‌ఫర్డ్‌లోని పల్నాడు ఒయాసిస్‌లో గురువారం రాత్రి బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. చిన్నారులకు ఫ్యాషన్ షో పోటీలు పెట్టారు. అనంతరం తమ డ్యాన్సులతో బాలలు అలరించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి, లాయర్ ధారా చెన్నయ్య, డాక్టర్ పెండ్యాల సునీత, డాక్టర్ రమ్య హారిక, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కోటా సాయికుమార్ పాల్గొన్నారు.
- ప్రతి విద్యార్థి మాజీ ప్రధాని నెహ్రూను ఆదర్శంగా తీసుకొని రాణించాలని ప్రధానోపాధ్యాయురాలు పి.కోటేశ్వరమ్మ అన్నారు. గురువారం జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాచర్ల రోటరీ క్లబ్ సభ్యులు ఎంపిక చేసిన నేషనల్ బిల్డర్ అవార్డు గ్రహీత యు. సువానందకుమార్‌కు అభినందనలు తెలిపారు.

రెంటచింతల: దేశ అభివృద్ధిలో నెహ్రూ పాత్ర కీలకమని, ఆయన బాటలో విద్యార్థులు నడవాలని ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. మోహన్‌లు అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ రామకృష్ణ గురుకులలో వారు నెహ్రూ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ... ఉత్తమ పౌరులుగా అందరూ ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసరావు, ఆత్మకూరి నాగేశ్వరరావు, మూలి రాజారెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేషధారణ పోటీలో పాల్గొన్న చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు



ఫ్యాషన్ షోలో పాల్గొన్న చిన్నారులతో నాయకులు



నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కోటేశ్వరమ్మ తదితరులు

మాచవరంలో గ్రంథాలయ వారోత్సవాలు

మాచవరం: పుస్తక పఠనంతో జ్ఞానం పెరుగుతుందని మాచవరం గ్రంథాలయ అధికారిణి బి.సుజాత తెలిపారు. వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలల దినోత్సవం జరిగింది. గ్రంథాలయ అధికారి కె. రాజశేఖర్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గి: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఎంపీపీ యేచూరి సాయిశంకర్ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. గ్రంథాలయాధికారి పులిబండ్ల వేణుగోపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్, ఈఓపీఆర్‌డీ సత్యప్రసాద్, జనసేన టౌన్ అధ్యక్షుడు రుద్రాల రవి, టీడీపీ నాయకులు సింగు నాగేశ్వరరావు, గోళ్ళ ఆంజనేయులు, మాజీ ఎంఈఓలు శెట్టిపల్లి గోపాలరావు, కోటా వీరయ్య చౌదరి పాల్గొన్నారు.



మహనీయులకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ సాయి శంకర్ తదితరులు



మాట్లాడుతున్న ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు

బాల్య వివాహాలు భావి తరాలకు చేటు

సత్తెనపల్లి: బాల్య వివాహాలు చేయడం భావితరాలకు ఉరితాడు వేయడమేనని ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆటపాటలు, విద్య, పౌష్టికాహారం, ఆరోగ్యం, సంరక్షణ బాలల హక్కులన్నారు. వారిని చదివించి ఉన్నత స్థానాలకు చేర్చేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతుంటే అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, స్నేహితుల ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు. కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఆడ పిల్లలని చదవనిద్దాం, ఎదగనిద్దాం, బతకనిద్దాం నినాదంతో ఈ నెల 14 నుంచి 20 వరకు బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ, పశువైద్యాధికారులు, యానిమేటర్స్, వీఓఏలు, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జైబూన్‌బీ

హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ పరిశీలన

అమరావతి: మండల కేంద్రం, ధరణికోట గ్రామంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ టి.పార్వతి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అమరావతి 1, 2, ధరణికోట1, 2 సచివాలయాల్లో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు సచివాలయాల పరిధిలోని హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ నిదానంగా జరగుతుందని, వంద శాతం పూర్తయ్యేలా పనిచేయాలని ఆదేశించారు. రెండు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

